


తలుపు తట్టాడు శేషు.

సమాధానం రాలేదు లోపలినుంచి.

మరోసారి తట్టాడు.

మరోసారి. మరోసారి.

"అబ్బబ్బ. ఏమిట్రా అది, తలుపు వలా దబదబ బాదేస్తున్నావ్? మునింటాయన కనక ఈ శబ్దం విని ఉంటే, గది ఖాళీ చేయమని ఈ పాటికి కథాకళి నృత్యం ప్రారంభించే వాడు!" తలుపు తీస్తూ, విసుక్కుంటున్నట్లు ప్రారంభించి, జోక్ లోకి జంప్ చేశాడు రూమ్మేట్ లక్ష్మీ ప్రసాద్.

"లేకపోతే ఏం చేసేదిరా? గాడిద బరువులా చేతుల నిండా ఇన్ని పాకెట్స్. ఎంతసేపని స్వంత గది ముందు వెర్రి ముఖం వేసుకుని నిలబడేది? చెవుడు లాంటిదేమీ రాలేదు కదా నీకు?" సంజాయిషీతో వెటకారాన్ని జత చేశాడు శేషు.

"ఏడిశావ్ లే! చెవుడా ఇంకేమైనానా? లేని జబ్బును అంట గట్టకు. ఎవరైనా వింటే పెళ్ళిళ్ళ మార్కెట్‌లో నా రేటు నేలబారు కొచ్చేయగలదు! నా కున్నదల్లా ఈ నీటి సైటొక్కటే" అన్నాడు లక్ష్మీ ప్రసాద్ కళ్ళజోడు సరి చేసుకుంటూ. మరే అవయవ లోపం లేదని ఎఫెక్టివ్‌గా చెప్పే ప్రయత్నంలో, తన కున్న డిఫెక్ట్ గురించి తనకు తానే పైకి చెప్పు కున్నాడు.

చాలామందికి మాట్లాడటం రాదు లక్ష్మీ ప్రసాద్ లాగే. అంటే మాటలు రావని కాదు. ఎవరి ముందు ఏ సమయంలో ఎలా మాట్లాడాలో తెలియదు. ఒకడి కొంప కూల్చేంత తెలివిగా లిటిగేషన్ మాటలు అవసరం లేదు కాని స్వంత కొంపని, ఏదీ కాలా అనుకోవాల్సిన పనిపును కాపాడుకునేంత తెలివిగా, జాగ్రత్తగా ఉండాలి నోరు తెరిచే ముందు. ఏదో నోటి కొచ్చింది వాగేసి, అనక నానా అల్లరి అయి పోయాక కాని, కూడని నష్టం జరిగి పోయాక కాని మెలుకువ రాదు చాలామంది మాట్లాడే వాళ్ళకు. అప్పుడు బుర్ర గోక్కున్నా, నాలు క్కరుచుకున్నా సారీ అన్నా 'నా ఉద్దేశ్యం అది కాదు. 'మిత్రా', అని నెపం పెట్టుకున్నా, 'నాకు నోటి దురుసు తప్ప నా మనసు వెన్న' అని స్వంతంగా సర్టిఫై చేసేసు కున్న బాకాలో బాపుకుంటున్నా, జారిన మాట తన ఫలితాన్ని తప్పక చూపిస్తుంది. "కాలు జారితే తీసుకోవచ్చు కాని మాట జారితే మాత్రం." అన్న సామెత ఏ నాడైనా నిజమే. అదే కాదు అసలు సామెత లన్నీ ఆకళింపు చేసుకుని బతికితే జీవితాన్ని ఈజీగా ఈదేయొచ్చు. జీవితసారాన్ని చక్కని వాక్యాల్లో చెప్పారు పెద్దలు. ఎప్పటికైనా అవన్నీ సత్యాలే. జీవితం అంటే 'గాడిద గుడ్డు' అన్నట్లు బతుకుతున్న ఈ జనానికి సామెతల సారాన్ని జాపోషణ పట్టే అవసరం కనిపించక పోవటంలో ఆశ్చర్యం లేదు.

"మరి ఏ అంతఃపురంలో అఘోరించావ్ రా ఇంత సేపూ? గది బయట నా గోల అసలు వినిపించలేదా నీకు?"

"ఆ. అంతఃపురం ఒక్కటే తక్కువ ఈ ఒంటి గది రాజమందిరానికి! ఎటాచ్డ్ బాత్‌రూమ్‌లో స్నానం చేస్తూన్నా. బయటి కొచ్చేసరికి తలుపులు సొమ్మసిల్లి పోయేలా నీ దబదబలు. వెంటనే తలుపు 'తీశా'

అంతకంటే ఏం చేయాలి అన్నట్టు చెప్పాడు లక్ష్మీపతి.

"అయితే ఇద్దరిలో ఎవరిదీ తప్పు లేదన్న మాట!" పరిపెట్టే యటంలో దిట్ట శేషు!

"ఏడిశావ్ కాని ఏం షాపింగ్ చేసుకొచ్చావో త్వరగా చూపించి తగలడు. ఆ ట్టే తెగ పూరించావంటే గట్టిగా నాలుగు తగిలించాల్సి ఉంటుంది! ఆ పైన నీ ఇష్టం." అన్నాడు లక్ష్మీపతి.

"అది సరే కాని, నువ్వెంత దురదృష్టవంతుడివిరా పతి! ఎంత బతిమాలినా రానన్నావ్ షాపింగ్‌కి. పండగ సీజన్ మూలాన్నో ఏమో బజార్నిండా ఎక్కడ చూసినా అందమైన సీతాకోకచిలుకలే! చూడటానికి ఈ రెండు కళ్ళూ చాల్లేదనుకో. నీ మీదొట్టు!" నిలబడి వయ్యారంగా మెలికలు తిరిగిపోతూ మరీ చెప్పాడు శేషు.

"ఏడిశావ్ లేవోయ్! ఎప్పుడు చెప్పినా ఇవే వెధవ కబుర్లు. విని విని విసుగెత్తి పోయాము. ఇకనైనా నీ పద్ధతి కనక మార్చుకోకపోతే వేరే రూమ్‌కి పోతాను నిన్నొదిలేసి. సొల్లు కబుర్లు మానేసి ఆ తెచ్చిన వేవో చూపించు. చూడబోతే బజారంతా మోసుకొచ్చినట్లు కనిపిస్తూంది" అన్నాడు లక్ష్మీపతి కొంచెం విసుగ్గా.

"ఇంతకీ నేను చెప్పినవి తెచ్చినట్లు లేదేంరా శేషూ?" అన్నీ చూశాక తను తెమ్మన్న టూత్ పేస్ట్, బూట్ పాలిష్ వగైరాలు కనిపించక పోయే సరికి ముఖం మాడ్చుకున్నాడు పతి.

"మరిచి పోయానురా బ్రదర్! సారీ. రేపు వెళ్ళినప్పుడు తప్పక తెస్తాగా. నే తెచ్చే వరకూ నావి వాడుకో" అన్నాడు శేషు.

"ఏమిటీ, రేపు మళ్ళీ బజారుకి పోతావా? చదువక్కర్లేకపోతే ఇంటికి పోయి పొలం దున్నుకో— ఒక పెద్ద పాలేరు జీతం అయినా కలిసొస్తుంది మీ నాన్నకి. ఇక రోజూ బజారుకి పోయే బదులు అక్కడే ఒక గది తీసుకుంటే పోలా? అయినా ఆ సీతాకోకచిలుకలు, రంగు రంగులకోకలు కనిపిస్తే ఈ రూమ్మేట్ గాడెందుకు గుర్తుంటాడు నీకు? వాడు చెప్పిన పని మాత్రం ఏం గుర్తుంటుంది?' అడ్డంగా దెప్పటం ప్రారంభించాడు లక్ష్మీపతి.

"అది కాదురా. . ." సర్ది చెప్పబోయాడు శేషు.

"నువ్వేం కల్లబొల్లి కాకమ్మ కథలు చెప్పనక్కర్లేదు. కనీసం శుభ్రంగా స్నానం అయినా ఆఘోరించు. చెమట వాసన కొట్టుకుంటూ ఉంటే గదిలో నిన్ను భరించటం నా వల్ల కాదు." ఈ మాటలు చెబుతున్నప్పుడు లక్ష్మీపతి ముఖం చూసి, వచ్చే నవ్వును ఆపుకోవటం కాస్త కష్టమే అయింది శేషుకి. పైపై సోకు లెన్నయినా చేస్తాడు కాని స్నానం చెయ్యటం అంటేమాత్రం, ఖచ్చితంగా ఓడిపోయే దేశంతరఫున యుద్ధభూమి కెళుతున్న సైనికుడిలా అయిపోతాడు శేషు. అదో వీక్‌నెస్ అతనికి. కాని తప్పదని తెలిసిందతనికి. స్నానం చేయందే పతి పూరుకునేలా లేడు.

చొక్కా తీసి హేంగర్‌కి తగిలించాడు శేషు. పాంట్ తీసి తగిలించ బోయేసరికి జేబులోని చిల్లర డబ్బులన్నీ నేలమీద పడ్డాయి. ఆ గలగల శబ్దాల్లో ఒక అపశ్రుతి వినిపించింది శేషు చెవులకి.

చెల్లా చెదురుగా పడి ఉన్న నాణా లన్నింటినీ ఏరాడు జాగ్రత్తగా. ఒక్కోదాన్ని నేల కేసి కొట్టటం ప్రారంభించాడు నెమ్మదిగా. ఇందాకటి అపశ్రుతి తాలూకు నాణెం పట్టుబడింది.

"సత్తు రూపాయ్". పైకి అనేశాడు మనసులో మాట.

"అంటే ఈ రోజొచ్చిన మనియార్డర్ తాలూకు ఈ చిల్లరే మిగిలిం దన్నమాట!" వెటకారంగా వ్యాఖ్యానించాడు లక్ష్మీపతి.

"అవును" అంటూ టవల్ తీసుకుని బాత్ రూమ్ లోకి జారుకున్నాడు శేషు.

"ఇక నెల పొడుగునా నా ప్రాణాలు తీస్తావన్న మాట పది ఇమ్మనీ, ఇరవై ఇమ్మనీ. డబ్బు లుంటే నీళ్ళలా ఖర్చుచేస్తావ్. అయిపోగానే బికారి రాముడులా తయారవుతావ్." ఇంకా ఎన్నో సణుక్కున్నాడు లక్ష్మీపతి. అందులో ఒక్క మాటా చేరలేదు శేషు చెవుల్ని!

బాత్‌రూమ్‌లో స్నానం చేస్తున్నంత సేపూ శేషు మనసు ఒకే విషయం గురించి తెగ ఆలోచిస్తూంది. 'ఏ షాపులో ఇచ్చి ఉంటారీ సత్తు రూపాయి?' అని ఎంత తలగోక్కున్నా గుర్తుకు రాలేదు అతనికి. అవును మరి. ఒక్క కొట్టుకి వెళ్ళి వస్తే ఆ మోసమేదో, మిస్టేకో అక్కడ జరిగిందని అనుకోవచ్చు. శేషు ఆ సాయంత్రం ఆరు నుంచి తొమ్మిది లోపులో కనీసం పాతిక షాప్స్ గుమ్మాలు ఎక్కాడు. దిగాడు. అందుచేత అతను ఆ సత్తు రూపాయి గురించి మరిచి పోవటం మంచిది.

---

## ఉపశమనం

అమెరికా, ఇంగండు వంటి దేశాలలో ఆర్థిక కారణాలవల పెళ్ళిళ్ళు ఆలస్యం అవుతుంటాయి యువతీ యువకులు ఉద్రేకాలు చలారడం కోసం. ఎక్కువగా సినిమాలు నాటకాలు చూస్తారు.

—సెర్జి జవ్ స్కీవ్.

---

స్నానంచేసి వచ్చాక వంటికి, ముఖానికి దట్టంగా పవుడర్ పట్టించాడు. ఇస్త్రీ చేసిన పూల లుంగీ, సిల్కు లాల్చీ ధరించాడు. చక్కగా తల దువ్వుకున్నాడు. మెడలో మెరుస్తున్న బంగారపు గొలుసు ఇంకాస్త రసికత్వాన్ని ఆపాదించింది అతని అందమైన విగ్రహానికి.

"శృంగార రాముడిలా ఉన్నావ్‌రా శేషూ!' అన్నాడు లక్ష్మీపతి నవ్వుతూ..

"అంగట్లో అన్నీ ఉన్నాయి. ఏం లాభం అల్లుడి నోట్లో శని! ఎంత సోగ్గా తయారయినా ఏం లాభం? తెల్లవార్లూ చూస్తే నువ్వేగా తగిలేది చేతికి! అమాంతంగా నువ్వో అందమైన ఆడపిల్లవయి పోతే ఎంత బాగుంటుందో కదూ?" అన్నాడు శేషు చిలిపిగా.

"సరి సరి! అటు తిరిగి పడుకో. ఈ సబ్జక్టు మీద ఇంకాసేపు మాట్లాడ్డానికి అవకాశం ఇస్తే అర్ధరాత్రి నిద్దరలో నన్ను మువ్ పేపర్ పొట్లంలా నలిపేసే ప్రమాదం కనిపిస్తూంది నాకు. కలల్లో ఎలాగయినా ఇదవ్వు కానీ నన్నిబ్బంది పెట్టకు బాబూ! గుడ్‌నైట్" అంటూనే లైటు ఆర్పేశాడు లక్ష్మీపతి. శేషు చిరునవ్వులు చీకట్లో కలిసి పోయాయి.

"రేపెలాగయినా దాన్ని తోసెయ్యాలి ఎక్కడో ఒక చోట, ఎవడో ఒకడికి" అని ఒక నిర్ణయం తీసుకుని కళ్ళు మూసుకున్నాడు శేషు. అతనికి నిద్ర రావటం చిరపుంజిలో వర్షం వచ్చినట్లే.

* * *

తెల్లవారింది.

కాలకృత్యాలు తీర్చుకున్నాక రంగడి కాకా హోటల్‌కి కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళారు లక్ష్మీపతి, శేషు. ఆ పట్టణంలో పెద్ద పెద్ద రెస్టారెంట్స్ లేక కాదు. పెద్ద చదువులు చదువుతున్నా వాళ్ళిద్దరూ ఆ కాకా హోటల్‌కి ఎగబడ్డానికి మూడు ముఖ్యమైన కారణా లున్నాయి. రూమ్‌కి దగ్గరగా ఉండటం మొదటికారణం. రెండోది 'చీప్ అండ్ బెస్ట్' కావటం కావటం. మూడోది ఆ హోటల్ సాంబార్‌కి వాళ్ళు ఇద్దరూ 'ఎడిక్ట్' అయిపోయేంత ఎటాచ్ అయిపోవటం.

అరువులు పెట్టే అలవాటు లేదు ఆ హోటల్ యజమాని రంగడికి. ఆ రోజు అమ్మకంతో మర్నాటికి సరుకులు తెచ్చుకుంటాడు. కొల్లాయి గుడ్డతో పరాయి దేశంవించొచ్చి (దేశం అంటే ఇక్కడ రాష్ట్రం అని అర్థం చెప్పుకో ప్రార్థన ! !) చిన్న రోడ్డు సైడు హోటల్ పెట్టి, కొన్నాళ్ళకి కోటీశ్వరులో, కనీసం లక్షాధికారులో అయిపోయారని వినటం కద్దు. కాని ఏన్నేళ్ళు వ్యాపారం చేసినా రంగడి స్థితిలో మాత్రం పెద్ద ఎదుగు బొదుగు లేదు. జనం బాగానే వస్తారు మరి. అదేంవిచిత్రమో లాభాలు పెద్దగా రావు! నేన్ని మంచో పేరుతో పిలవటానికి సాధ్యపడదు కనుక దురదృష్టం అనేసి ఇంచక్కా తప్పించుకోవచ్చు! ఈ లోకంలో జనాన్ని అదృష్టవంతులు, దురదృష్టవంతులు అని రెండు రకాలుగా విభజిస్తే రంగడికి రెండో రకంలో ప్రముఖస్థానం ఇచ్చితీరాలి ! !

టిఫిన్ తినటం అయింది. ఆఖరితో వహా ఆరగించారు స్పెషల్ కాఫీని! శేషు బిలు చెల్లించటానికి లేచాడు. జేబులో చెయ్యి పెట్టగానే అతని చేతికి ముందుగా తగిలింది సత్తు రూపాయి. ఆ క్షణంలోనే దాని పీడ వదిలించుకోవాలనుకున్నాడు శేషు. జేబులో దాన్ని గట్టిగా పట్టుకున్నాడు జారి పోతున్న మట్టగిడస చేపని పట్టుకున్నట్టు!

"రెండు ప్లేటిడ్లీ, రెండు స్పెషల్ కాఫీ" గొంతు చించుకున్నాడు పనికుర్రాడు, రెండడుగుల దూరంలోనే ఉన్న యజమాని రంగడికి బ్రహ్మ చెముడున్నట్టు! అది అతని అలవాటు బిల్లు గురించి యజమానికి చెప్పేప్పుడు అలా అరవటం సర్వర్ల కోడ్ ఆఫ్ కాండక్ట్‌లో ఒక ముఖ్యాంశం కాబోలు! కాని ఆ రకం హోటళ్ళకి పెనంమీద నించొచ్చే 'చుంయ్, చుంయ్'లకి తోడుగా సర్వర్ కుర్రాళ్ళ పొలికేకలుంటేనే అందం! ఆ వాతావరణం అంత హడావుడిగా వుంటే తప్ప శోభ వుండదు! కళ కట్టదు!

"తొంబై పైసలు బాబూ."

రంగడి మాటలతో అప్పటివరకూ శేషుతో చెలిమి చేస్తున్న పరాకు 'జలుబు కొట్టేసి' హరి పోయింది దూరంగా.

సత్తు రూపాయి ఇవ్వాలా, వద్దా అని ఒక క్షణం సందిగ్ధంలో కొట్టుమిట్టాడేక, రంగడి ముఖం చూశాక జాలేసింది శేషుకి. పై జేబులోంచి రూపాయి నోటు తీసి ఇచ్చాడు. అతనిచ్చిన పది పైసలు జేబులో వేసుకుని బయటపడ్డాడు.

అప్పటివరకూ రోడ్డుమీద వెయిట్ చేస్తున్న లక్ష్మీపతి విసుక్కున్నాడు—"బిల్లిచ్చి రావటానికి అంత సేపేంటిరా? అవతల సిటీ బస్...."

"వెళ్ళిపోయిందా కొంపదీసి?" దిగులుగా అడిగాడు శేషు.

"ఇంకా వెళ్ళలేదనుకో."

"మరింకెందుకు అలా ముఖం మాడ్చుకుంటావ్?"

"అదిగో. ఆ నిర్లక్ష్యమే పనికిరాదు. టైమ్‌కి వచ్చి నిలబడటమే మన పని. అంతేగాని ఈరోజు రావటం లేట్ అయినా బస్సు మిస్ అవలేదుకదాని మురిసిపోకూడదు అలాంటితత్వం అలవాటు చేసుకుంటే జీవితంలో ఏ మనిషి కూడా...."

"సరి సరిలే. ఉపన్యాసం ఆపు. అవతల మన నంబర్ బస్ వచ్చేస్తుంది" అన్నాడు శేషు.

బస్ వచ్చేసినందువలన లక్ష్మీపతి లెక్చర్ ఆగిపోయింది. కరెంట్ పోగానే అప్పటిదాకా వాగుతున్న రేడియో సడెన్‌గా నోరు మూసుకున్నట్లు.

బస్ ఎంట్రన్స్ దగ్గర తోపులాటు, గింజులాటు, పెనుగులాటు, లాగులాటు, పోరులాటు, అలా రకరకాల ఆటల పోటీలు ఒక అయిదు నిముషాలు సాగిన అనంతరం విజేతలు (దురదృష్టవంతులు!!) బస్‌లోకి తోసబడ్డారు. కనీసం గాలినయినా పీల్చుకునే అదృష్టానికి నోచుకున్నవాళ్ళు ఎక్కలేక దిగబడిపోయారు! అంతా మనమంచికే అంటే అదే కాబోలు!!

ఆ బస్ మిస్ అయితే ప్రొఫెసర్‌గారి క్లాసు మిస్ అవుతారు కాబట్టి ప్రతిరోజూ దురదృష్టవంతులు కావటానికే పోరాడతారు లక్ష్మీపతి, శేషు! ఆ రథం యూనివర్శిటీ స్టాప్ చేరేవరకూ 'లగేజి' పాత్ర ధరించాల్సిందే ప్రతిరోజూ.

అంత బ్రతుకలేని చికాకులోనూ శేషు మనసు మాత్రం అతని ఆధీనంలో లేదు.

'అదేమిటి సార్, సత్తు రూపాయిచ్చారు?' కండక్టర్ మాటలకు జనమంతా గొల్లుమన్నారు. శేషు సిగ్గుతో ముడుచుకుపోయాడు. తల తీసేసినంత అవమానం ఫీల్ అయ్యాడు మనసులో. అంత మందిలో అనవసరంగా అవమానం పాలుచేసినందుకు సత్తు రూపాయి ప్రాణాలు తీయాలనిపించింది శేషుకి...

"సార్! మీది సీజనేకదా?" అలవాటైన కండక్టర్ అసలు పలకరింపుతో ఆలోచనలకి 'టాటా' చెప్పాడు శేషు.

"ఆ. సీజనేగాని నిన్నటితోనే అయిపోయింది ఇంకా క్రొత్తది తీసుకోలేదు. యూనివర్శిటీకి రెండివ్వండి. నా ఫ్రెండ్ అక్కడ నిలబడ్డాడు." పై పాకెట్‌లోంచి మరో రూపాయి నోటు తీసి అతని చేతిలో పెట్టాడు. అతనిచ్చిన టిక్కెట్లు, చిల్లర జేబులో వేసుకున్నాడు.

"మీరు చాలా జంటిల్‌మాన్ సార్! ఈ రోజుల్లో చాలామంది సీజన్ టిక్కెట్ అయిపోయిన పది, పదిహేనురోజులదాకా అడిగినప్పుడల్లా 'ఇంటిదగ్గరుంది. తేవటం మర్చిపోయాం రేపు తెస్తాం' అని అబద్ధాలతోనే గడిపేస్తారండి. చదువుకున్నావోళ్ళు సది, ఇరవై పైసలకోసం వచ్చి అబద్ధాలాడుతూంటే నాకు తెగ నవ్వు వస్తుందనుకోండి. కక్కుర్తి బుద్ధికి, మనిషి చదువుకి సంబంధంలేదనిపిస్తుందనుకోండి వాళ్ళని చూస్తే. మీలాంటి వాళ్ళు అరుదు సార్!" శేషుకి ఒక కాంప్లిమెంటిచ్చి, ముందుకు సాగిపోయాడు కండక్టర్.

"ఆ సత్తు రూపాయి ఇవ్వాల్సింది. అప్పుడేమని సర్టిఫికేట్ ఇచ్చేవాడో కండక్టర్?!" అనుకుని తనలో తాను నవ్వుకున్నాడు శేషు. అసలు ఇచ్చి ఉండాల్సినదే. కాని ఆలోచనల్లో జరిగిన పరాభవానికే బెదిరిపోయాడు శేషు. అందుకే సత్తు కాసును తోసేసే పథకాన్ని తాత్కాలికంగా వాయిదా వేశాడు. అందులోనూ బాగా పరిచయం ఉన్న కండక్టర్ అతను. రోజూ ఒకరి ముఖాలొకరు చూసుకోవాలి. తను కావాలని సత్తురూపాయిని మార్చేయటానికి ప్రయత్నించినట్లు ఏమాత్రం పసిగట్టినా ఆ కండక్టర్ తనని చూసినప్పుడల్లా నవ్వుకుంటాడు. తన కొలీగ్స్ దగ్గర చెప్పి, నిక్ నేమ్ పెడతాడు 'సత్తు రూపాయ్' అని. అది మరీ దుర్భరం. అంచేత కాస్సేపు సత్తుకాసును మర్చిపోయాడు.

## ప్రేమ : కామం

ప్రేమకు. కామానికి తేడా ఉంది. అనుభవించిన కొద్దీ కామం తరుగుతుంది, ప్రేమ పెరుగుతుంది - కారణం ఒకటి ఆత్మ సంబంధం రెండవది దేహ సంబంధం.

—సెవ్

ఎక్కినంత కష్టం కాకపోయినా బస్‌లోంచి బయటికి ఊడిపడటం కూడా మరీ అంత తేలికయిన పనికాదు. ఇంటిదగ్గర ఇస్త్రీబట్టలు వేసుకుని బయల్దేరితే బస్సు దిగేసరికి వెంటనే దోబీకి వేయాల్సిన గుడ్డల్లా మారిపోతాయ్. ది క్రెడిట్ గోస్ టు ది సిటీ బస్! ఆ స్థితిలో ఉన్న గుడ్డలతో ఆ దినం అంతా గడపటం చికాకే. అయినా తప్పదు. అలాంటి స్థితిలో యూనివర్శిటీ బస్ స్టాప్‌లో బయటపడ్డారు శేషు, పతి!

ఏం చెబుతున్నాడో చెప్పేవారికి తెలియదు! ఏం వింటున్నాడకి ఏమిటి క్రొత్తగా తెల్సుకుంటున్నాడో వినే విద్యార్థికి తెలియదు! యూనివర్శిటీ క్లాస్ రూమ్స్‌లో రోజూ ఇదే జరిగేది, సాధారణంగా. అసలు ఏన్యువల్ ఎగ్జామ్స్ ముందు మాత్రం లావు లావు పుస్తకాలు ముందేసుక్కూర్చుని పగలూ రాత్రీ నూరేసి, కషాయంలా తాగేసి, పరీక్షల్లో పేపర్లమీద కాస్త, వొరల్ ఎగ్జామ్‌లో ఇంకాస్త కక్కేసి, క్లాస్ తెచ్చుకోవటం అక్కడి విద్యార్థుల కలవాటు.

"ఇవ్వాళ క్లాసులన్నీ సుత్తులేరా పతి. ఇంత ఘోరమైన తలపోటును నిత్యం భరిస్తూ ఇంకా మనం బ్రతికే ఉన్నామంటే మనం నిస్సందేహంగా కారణజన్ములమయి ఉంటాంరా!" మధ్యాహ్నం రీసెస్‌లో యూనివర్శిటీ కేంటీన్ వైపు దారితీస్తూ అన్నాడు శేషు.

"ఎందుకు పుట్టేమో నాకు తెలియదు గాని ఈ బోర్ భరించలేక అప్పుడప్పుడు చదువు వదిలి పారిపోదామని మాత్రం అనిపిస్తుంది నాక్కూడా."

అన్నింటా చుక్కెదురైన ఆ స్నేహితులిద్దరూ వంద పర్సెంట్ ఏకీభవించే అతి కొద్ది విషయాల్లో అదొకటి!

కేంటీన్ రకరకాల శబ్దాలతో పరమ కోలాహలంగా ఉంది. నీచువాసన మినహా, సందడిలో ఏమాత్రం తీసిపోదు చేపల బజార్‌కి!

డైనింగ్ టేబిల్ ముందు కూర్చోగానే రెండు ప్లేట్ మీల్స్ తెచ్చిపెట్టేడు సర్వర్.

"ఏటిసార్ ఇసేసాలు?" అనేసి సమాధానం అవసరం లేదన్నట్లు వెళ్ళిపోయాడు ఆ సర్వర్ కుర్రాడు. అందరికీ అదే ప్రశ్న వేయటం ఆ కుర్రాడికి అలవాటు. కాదు, వ్యసనం! సమాధానం కోసం వేసే ప్రశ్న కాదది. అదోరకం పలకరింపు!

వాడి ప్రశ్నకు ఒళ్ళు మండింది శేషుకు. "పీడికిదో జబ్బు. వీడికీ, మనకీ మధ్య విశేషాలేమిటి? మన కొలీగ్ అనుకుంటున్నాడో, క్లోజు ఫ్రెండనుకుంటున్నాడో. క్లాసులో పంతుళ్ళ బోర్. ఇక్కడికొస్తే వీడిగోల." విసుక్కుంటూ 'పెరుగు అనబడే నీళ్ళ మజ్జిగను ప్లేటులో గుమ్మరించుకున్నాడు. భోజనం అయిందనిపించాడు.

"అదేమిట్రా, అలా కోడి కెక్కిరించినట్లు, ఆ తిండి? భోంచేసేప్పుడు అలా రుస రుసలాడకూడదు. అన్నం తినేప్పుడు మనము ప్రశాంతంగా గనక లేకపోతే ఆకలి, జీర్ణశక్తి దెబ్బ తింటాయని డాక్టర్స్ చెబుతారు" అన్నాడు పతి. మరో రెండు నిముషాల్లో అతని ప్లేటు కడిగిన అద్దంలా తయారయింది! అట్లా శుభ్రంగా భోంచేయటం అందరికీ రాదు. నిజంగా అదో కళ.

"ఈ పంచభక్ష్య పరమాన్నాల్ని ఇంకా అందంగా తినాలా?! అయినా ఇక్కడేముంది తిని తగలేయటానికి? ఏనాడో పాపంచేసి ఉంటాం. అందుకే మన ముఖాన ఈ కుక్కులకూడు రాశాడు భగవంతుడు. ఎదిగే వయసులో, నిండు యవ్వనంలో తినాల్సిన తిండేనట్రా ఇది? మరి ఇలాంటి తిండిలోంచి జావగారిపోయే అర్భక జనరేషన్ కాక హెర్క్యులిస్‌లూ, ఆర్నిమిడిస్‌లూ పుట్టుకొస్తార్రా?!"

శేషు మాటలకు సమాధానం చెప్పలేదు పతి. 'సైలెన్స్ ఈజు గోల్డ్' అని తెల్సు పతికి.

"ఒరేయ్, సింహాచలం!"

శేషు కేకవిని, క్లీనర్ కుర్రాడు పరిగెత్తుకుంటూ దగ్గరకు వచ్చాడు.

"ఒరేయ్, ఇది మారుతుందా చూడు."

కాసును వేలకేసి కొట్టాడు సింహాచలం.

"ఇది సత్తుదయ్యగారూ! ఎవ్వరూ ఇవ్వ

కోవండి.''

''ఖర్మ! ఏడేళ్ళ గుంటడికూడా తెల్సి పోయింది'' అనుకున్నాడు శేషు.

కోటి పాపాలు చేసినా, ఒక్కసారి గంగానదిలో మునిగి శివుడి ముందు లెంపలు వేసుకుంటే ఆ పాపాలన్నీ పోతాయని ఓ ప్రతీతి. 'వంద కొత్త తెలుగు సినిమాలు చూడగా పేరుకుపోయిన తలపోటు ఒక్క పాత సినిమా చూస్తే పటాపంచలమయిపోతుంది' అన్నట్టున్నాయి. ఈనాటి తెలుగు సినిమాలు. ఆ రాత్రి ఆ బాపతు పాత సినిమాకెళ్ళారు శేషు, పతి. సెకండ్ షో అయ్యేసరికి ఒంటిగంటయింది.

హాలునించి బయటికొచ్చేసరికి వర్షం కుండ పోతలా దంచేస్తుంది. దానికితోడు చీకటి రాత్రి.

''ఈ వాన ఒక్క పది నిముషాలు ఆగితే బావుండును. ఇంచక్కా నడిచిపోయేవాళ్ళం మన రూమ్‌కి'' అన్నాడు పతి.

''ఒక్క ఇరవై నిముషాలు ఆగితే బాగుండు ననుకుంటాడు మనకంటె ఇంకాస్త ఎక్కువ దూరం వెళ్ళాల్సిన వాడు! అట్లాగే అందరూ!'' నవ్వుతూ అన్నాడు శేషు.

మనిషంత చిత్రమైన జీవి మరోటి లేదు సృష్టిలో. తనకు కావాల్సిందాని గురించే ఆలోచన తప్ప మరోటి తట్టదు బుర్రకి. 'అబ్బ! వేడిగా ఉంది వాతావరణం'' అని అతని కనిపించగానే చల్లబడిపోవాలనుకుంటాడు. నాటేన విత్తులు మొలకెత్తటానికో, పైర్లు ఏపుగా పెరగటానికో ఆశగా ఆకాశంలో మబ్బులకోసం వెతుకుతున్న రైతు, చినుకులు పడగానే ముత్యాలు రాలుతున్నంతగా మురిసిపోతాడు. అదేసమయానికి సిటీల్లోను, టవున్స్‌లోను మోకాటిలోతు నీళ్ళలో వీధుల్లో తిరగాల్సిన దృశ్యాన్ని గుర్తు చేసుకుని ''వెధవ్వాన!'' అని తిట్టుకుంటూంటారు జనం. అలాగే ప్రతీదీ. అందర్నీ తృప్తిపర్చటం ఆ సృష్టికర్తకే సాధ్యం కాకుండా ఉంటే, ఇక ఒక మనిషి తన వాళ్ళనందర్నీ తృప్తిపర్చాలని ప్రయత్నించి విఫలయిపోవటంలో ఆశ్చర్యం ఏముంది?!

''ఈ వర్షం ఎలాగూ ఒకపట్టాన వదిలేలా లేదు. నా కసలే నిద్ర ముంచుకొస్తోంది. పోనీ రిక్షామీద పోదాం'' అన్నాడు శేషు.

''ఎందుకురా, ఈ కాస్త దూరానికి రిక్షా? రూపాయి కావాలంటాడు. కాస్సేపాగి చూద్దాం. తగ్గకపోతే అప్పుడు రిక్షాలో వెళ్దాం'' పతి కొంచెం పొదుపరి. శేషుతో పోల్చి చూస్తే 'మహా గొప్ప పొదుపరి!'

''ఆ పోనిద్దూ, ఎన్ని ఖర్చులు చేయటంలేదు? ఈ ఒక్క రూపాయి మనల్ని ఉద్ధరిస్తుందా?'' అంటూనే ఒక రిక్షావాలాని పిల్చి రూపాయికి బేరమాడి, ఎక్కి కూర్చున్నాడు శేషు. పతి కూడా దూరేడు గుడారంలా చుట్టూ పైకా గుడ్డలు (అంతా అలా పిల్చినా, నిజానికవి పొలిథిన్ కాగితాలు) కట్టిన ఆ రిక్షాలోకి. ఆ గుడ్డలు వర్షం నించి ఇచ్చే ప్రొటెక్షన్ కన్నా, 'అవున్నాయి కనక ఆట్టే తడిచిపోలేం' అన్న ఫీలింగు ఎక్కువ ఆనందాన్నిచ్చి, ఇచ్చే రూపాయి సంగతి మర్చిపోయేలా చేస్తుంది, దిగేవరకూ. గదిలో దూరగానే అనవసరంగా డబ్బులు రిక్షాకోసం తగలేసినట్లు బాధపడుతుంది మనసు!

రిక్షా బయల్దేరగానే శేషు ఆలోచనలు సత్తు రూపాయిమీదకి మరిగెత్తాయ్.

'రాత్రి కాబట్టి, రిక్షావాడికి తోసేస్తే? బేష్. భలే అయిడియా.' ఎవరికి వారే 'నేనూ బేష్, నా అయిడియా బేష్' అనేసుకోవటం అంత మంచి అలవాటుకాదు. అయినా అనేసుకున్నాడు శేషు. చాకులాంటి ఆలోచనొచ్చినందుకు తనని తానే అభినందించుకున్నాడు. బుర్ర పాదరసంలా పని చేస్తున్నందుకు తెగ మురిసిపోయి, అయిస్ అయి పోయాడు. మరి కొద్ది నిముషాల్లో సత్తురూపాయి పీడ విరగడయిపోతున్నందుకు అతని మనసు 'మందు' తాగి, నిప్పుతొక్కిన కోతిలా గంతు లేయటం ప్రారంభించింది, పని అవ్వకుండానే!!

''మావా! యియ్యాల కూడు నేకుండానే తొంగున్నారు గుంటళ్ళు.''

''యేటి సేసేదే లచ్చి? ఒకప్పుడేవో మనూల్లో ఎంద రిచ్చాలుండేయి. మరిగంటే యియ్యాల ఎయ్యి అయిపోనాయి. పెజలు మోటారు బళ్ళు కొనేసు కుంటన్నారు అప్పో సప్పో సేసి. యియ్యికాక ఎక్కడి కక్కడ సిటీ బస్సులు. ఈటిమద్దెన మన రిచ్చాలకి బేరాలేటుంటాయే?''

---

**మనిషి**

తనలోని పశు వాంఛలు తీరినా ఎంతకీ తృప్తి చెందని వాడు మనిషి.

—అలెగ్జాండర్ గ్రాహంబెల్

**స్కోప్**

ప్రేమని టెలిస్కోప్‌తో చూడాలి ద్వేషాన్ని మైక్రోస్కోప్‌తో చూడాలి.

—హెన్రీ వీలర్ షా

---

''ఎందుకొచ్చిన తిప్పలు గాని మన పాలెం పోయి పొలం పని సేసుకుందాం మావా. అక్కడింత కూడయినా దొరుకుద్ది. మనకేంగాని గుంటళ్ళని సత్తులుంచటం నావల్లగాదు'' లచ్చి గొంతులో జీర. మహారాణీ అయినా, మట్టి పిసుక్కునే మాలచ్చి అయినా, బిడ్డని కని 'తల్లి' అయ్యాక తనకోసం తను బ్రతకటం మర్చిపోవటం, బిడ్డ తప్ప వేరే ప్రపంచం లేదనుకోవటం అతి సహజం. పిల్లలు పెరిగి పెద్దవాళ్ళవ్వరు. ఈ లోకంలో జంతువుల్లాంటి పాపలుండరు, పురిటిలోనే పిల్లను వదిలి, తల్లి తన దారిన తాను పోగలిగితే. అలా జరిగితే ఆఖరికి ఒకనాటికి లోకంలో మానవులన్న వాళ్ళే మిగలరు.

''ఇరవై ఏళ్ళు రిచ్చా పెడళ్ళు తొక్కాక, పొలం పనులేం సేయగల్నే? ఈ బతుకు రిచ్చాకే అరిపించి నట్టు. ఆటో కాలు, ఇటో కాలు ఏత్తే ఏదీ మిగల్దు సివరికి. ఇయ్యాల బేరమెత్తే కాని కొంపకి రాకూడదని అడనే నడున్నా.పిట్టు సివరికి ఒక రూపాయి దొరికింది రెండో ఆట వదిలాక. పుప్పు డెట్టాగూ కొట్టు లుండవ్ కాని, సీకటి తోనే సూక సట్టు కొచ్చి జావ కాసి పోయి ఆళ్ళకి'' అంటూ రూపాయి కాసు తీసి పెళ్ళాంచేతిలో పెట్టాడు రిక్షా తెచ్చి.

గుడిసెలో గుడ్డి దీప పరిహాసంది లచ్చికి రూపాయి సత్తుదని తెలుసుకోవడానికి. వినుకాలు నూరుకునే రాము ఆ నిజాన్ని బుజువు చేసింది.

''యిదేటి మావా?''

''యాందే?''

''యిది సత్తు కాసు మావా.''

రిక్షా లచ్చి నోట మాటలేదు.

కాస్సేపటికి అన్నాడు, ''రేపు కిరాయి దొరికే దాకా గుంటళ్ళకి గంజి నీళ్ళు లేనట్టే గందా లచ్చి?''

ఆమె మాట్లాడలేదు.

''ఒకేళ రేపుకూడా ఆపై రేపుకూడా కిరాయి దొరక్కపోతే ఏటవుతాదే?'' ప్రశ్నించా డతను.

''ఏటవుతాది?' అన్నట్టు ప్రశ్నార్థకంగా అతని కళ్ళల్లోకి చూసింది లచ్చి.

''నువ్వు కన్నదానివి కనక నీకు నోరు రాదు సెప్పటానికి. నే సెబుతా. మన గుంటళ్ళు ఆకలో మాడీ సచ్చి పోతారు కట్ట కట్టుకుని ఒక్కసారే. అళ్ళ తరవాత మనిద్దరం. దీని కంతకీ కారణం తెలుసా లచ్చీ? ఆ నంజకొడుకు సీకట్లో నాకు తోసేసిన సత్తు రూపాయి. ఆడు పురుగులు పడి సచ్చి పోవాల' నా ఉసురు ఆడికి తగిలి ఆడు నాశనమయి. . ..

''ఇక దిగరా. ఏవిటే, ఈ రోజంతా ఒకటే వరాకు.'' పతి పిలుపు లాంటి మందలింపుతో శేషు మనసు ఆలోచ ల్నొదిలి మామూలు స్థితి కొచ్చింది.

''రిక్షాకి డబ్బులిచ్చేశా కాని నువ్వు దిగిరాత్వరగా'' గది తాళం తీస్తూ అన్నాడు పతి.

శేషు కిందికి దిగగానే రిక్షాని వెనక్కి తిప్పి వెళ్ళి పోయాడు రిక్షావాలా. అప్పటికే గదిలో ప్రవేశించిన పతి లైట్ వేశాడు.

గబుక్కున చేయి జేబులో పెట్టి సత్తురూపాయిని పైకి తీసి రోడ్డు పక్కన 'ఈ ప్రాంతానికి నవే నముద్రాన్ని' అన్నట్లు ప్రవహిస్తున్న మురికి కాల్వ లోకి విసిరి కొట్టి, తృప్తిగా గాలి పీల్చి, గదిలో ప్రవేశించాడు శేషు.

''భగవాన్! నే నెప్పుడూ ఎవర్నీ మోసం చేయకూడదు. మోసం చేయబోతేనే నా మనసు వణికి పోతూంది. దాన్నెప్పటికీ అలా నిర్మలంగానే ఉంచు. అదే నే నడిగే వరం నీ నుంచి''. మనసులో భగవంతుడ్ని ప్రార్థించాడు, రాత్రి నిద్ర పోయే ముందు భగవంతుడ్ని ప్రార్థించే అలవాటున్న శేషు అనంతరం ప్రశాంతంగా నిద్ర పోయాడు.

ప్రతి మనిషికీ స్ఫటికంల స్వచ్ఛమైన, గంగాజల మంత పవిత్రమైన, మంచి మనసిచ్చి సృష్టిస్తాడు భగవంతుడు. అవసరమో, అతి తెలివో, వక్ర బుద్ధో, పరిస్థితులో తరచు బురద లోకి లాగ టానికి చూస్తాయ్. మనిషి చేత తప్పటడుగుని వేయిస్తాయ్. నేరాలు, ఘోరాలు చేయిస్తాయ్. కాని మంచి చెడ్డల్ని అనుక్షణం అద్దంలో చూపించి చెడు చేయొద్దని హెచ్చరించే మనస్సాక్షిని మరువ కుండా మసులుకుంటే చాలు, తప్పు చేయటం ఆ మనిషి తరం కాదు. అందుకే ఎల్లప్పుడూ దేవు డిచ్చిన మల్లెపూవు లాంటి మీ 'మనసుకే మీ వోటు'. ❋